క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పడమటి తండాకు చెందిన పాత్లావత్ కోటి (61) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 3వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో దాస్య, శంకర్, బిచ్య, రాములు, తావుర్యా, శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

- తహసీల్దార్‌కు అర్కపల్లి గ్రామస్తుల వినతి



తహసీల్దార్ సునీల్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మాడ్గుల: మండలంలోని అర్కపల్లిలో గల ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు మాడ్గుల తహసీల్దార్ సునీల్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమ పంచాయతీ పరిధిలో కొందరు చెరువు, కుంటలను కబ్జా చేస్తున్నారని తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రాంకిషన్, గిరి, రామకష్ణ, నరేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

మాడ్గుల: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్స్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎమ్ఎస్‌సీ)కు ఈ ఏడాది మాడ్గుల మండలం ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 22 మంది ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పాఠశాలలో ఈ స్కాలర్‌షిప్‌కు 70 మంది వరకు ఎంపికయ్యారని.. వారికి ప్రభుత్వం ప్రతీనెల 1000 రూపాయల చొప్పున ఐదు సంవత్సరాల వరకు నగదు అందజేస్తుందని తెలిపారు. స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిభావం కలిగి ఉండాలి

- మున్సిపల్ కౌన్సిలర్ రాధమ్మ



పూజలో కౌన్సిలర్ రాధమ్మ, భక్తులు

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, మున్సిపల్ కౌన్సిలర్ కమటం రాధమ్మ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమయ్యింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రాఘవేందర్, దీప్తి దంపతులు.. రూ.15,116 విరాళం అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి సత్యానారాయణ, కోశాధికారి సాయికుమార్, సభ్యులు.. పరమేశ్, సత్తయ్య, మురళి, ప్రసాద్, బాల్‌లింగం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు



కొనసాగుతున్న ప్రత్యేక పూజలు

కందుకూరు: మండలంలోని ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లి పరిధిలోని లక్ష్మీ చెన్నకేశ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుడు రేవెళ్ల రాజుశర్మ సమక్షంలో ఉదయం మహాగణపతి పూజ, విశ్వక్సేన పూజతో మొదలై అఖండ దీపారాధన, ధ్వజారోహణం, మండప పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం స్వామి వారి తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అర్చకులు తిరునగరి గోపాల్, సాయికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఎంపీపీ నర్మద
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం
- తాగునీరు, విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యంపై సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్మద

మంచాల: గ్రామాల్లో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ నర్మద అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ఆరుట్ల ఎంపీటీసీ సభ్యుడు చీరాల రమేష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ గ్రామాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కూలీలందరికి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తాళ్లపల్లిగూడ ఎంపీటీసీ సభ్యురాలు సుకన్య కోరారు. గ్రామల్లో చాలామంది ఉపాధి పనిలేక ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్ల సకాలంలో అందించాలని, వర్షాల కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సభ్యులు లేవనెత్తిన ప్రతీ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ వెంకటప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వేడుకల్లో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్ష్మీనృసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని అన్నారు. పెద్ద చెరువు సుందరీకరణలో భాగంగా నృసింహస్వామి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయ భూమి ఆక్రమణకు గురికాకుండా భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తానన్నారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జెడ్పీటీసీ భూపతిగాళ్ళ మహిపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వేడుకను తిలకిస్తున్న భక్తజన సందోహం

లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా జగన్మోహన్‌రెడ్డి



కందుకూరు: పీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా కందుకూరు మండలం జైత్వారం గ్రామానికి చెందిన బైరు జగన్మోహన్‌రెడ్డిని నియమించినట్లు చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ బుధవారం ప్రకటించారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు నియామక పత్రం ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. తనకు ఈ పదవి అప్పగించినందుకు అశోక్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించే ప్రతి పనిని నిబద్ధతతో పూర్తి చేసి పార్టీ పటిష్టతకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కమిషనర్ చంద్రశేఖర్

మీర్‌పేట: రానున్న వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలు పరిష్కరించాలని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. బుధవారం కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. కాలనీల్లో, ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మూతలు లేని మ్యాన్‌హోళ్లను గుర్తించి వెంటనే మూతలు ఏర్పాటు చేయాలన్నారు. శానిటరీ, ఇంజినీరింగ్ అధికారులు, రెస్క్యూటీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అసలే ఎద్దడి.. ఆపై నీటి వృథా!

- తాగునీరు రోడ్డు పాలు
- లీకేజీలను పట్టించుకోని అధికారులు



విజయపురి కాలనీ ఫేజ్-1లో వాల్వ్ వద్ద లీకవుతున్న తాగునీరు

ఎల్‌బీనగర్: అసలే వేసవి కాలం... ఆపై తీవ్ర నీటి ఎద్దడి... దీనికి తోడు అక్కడక్కడా పైప్‌లైన్ లీకేజీలు వల్ల లోప్రెషర్‌తో నీరు సరఫరా కావడంతో మంచి నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పాలవుతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా తరుచూ వాల్వ్‌ల వద్ద నీరు లీకేజీ అయి ప్రతిరోజూ నీటి సరఫరా వేళలో రోడ్లపై వృథాగా పోతున్నది. బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో విజయపురి కాలనీ ఫేజ్-1 వద్ద వాటర్ లీకేజీ అవుతోంది. రోజుల తరబడి నీరు వృథాగా రోడ్ల పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఈ లీకేజీ వల్ల కాలనీలకు తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతోందని పలువురు వాపోతున్నారు. ఇలా రోజంతా నీరు రోడ్ల పాలవడం వల్ల రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. అసలే అరకొరగా సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం సరిపోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి వాటర్ లీకేజీలను అరికట్టి సరఫరాను మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



గండిపేటలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి సంధ్య

మొయినాబాద్ రూరల్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని పంచాయతీ కార్యదర్శి సంధ్య పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆయా హోటల్స్, రోడ్ల ప్రక్కన చెత్తాచెదారం వేస్తే ఫెనాల్టీ తప్పదని పంచాయతీ కార్యదర్శి సంధ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గండిపేట చౌరస్తా మొదలుకొని హిమాయత్‌నగర్ వరకు ఆమె రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటల్ యజమానులు, వ్యాపారస్తులు పలువురు చెత్తను ప్లాస్టిక్ కవర్లల్లో తెచ్చి రోడ్డు ప్రక్కన వేయడం పరిసరాల పరిశుభ్రతకు విరుద్ధమని తెలిపారు. ఇలా వేస్తే సీసీ కెమెరాల ద్వారా పట్టుకొని ఫెనాల్టీ వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ కార్యవర్గం ఎన్నిక



వనస్థలిపురం: డివిజన్‌లోని శ్రీనివాసపురం కాలనీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.అంజిరెడ్డి, ఎస్.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీరాములు నేత, సంయుక్త కార్యదర్శులుగా ఎం.గోవర్ధన్ నేత, ఎస్.నర్సింహారెడ్డి, కోశాధికారిగా జె.మురళీధర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.బాలచందర్, సలహాదారుగా ఆర్.మనోహర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

ఆమనగల్లును రెవెన్యూ డివిజన్ చేయాలి


- జెడ్పీటీసీ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనురాధ

ఆమనగల్లు: ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను కలుపుకొని నూతనంగా ఆమనగల్లును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ అనురాధ కోరారు. పట్టణంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసిన సమయంలో కడ్తాల మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేసి కడ్తాలతో పాటు ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలను మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వేరుచేసి రంగారెడ్డి జిల్లాలో కలిపారని వివరించారు. అయితే అదే సమయంలో ఆమనగల్లును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయకుండా కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కలపడంతో ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈ ప్రాంతవాసి అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమనగల్లు ప్రాంతానికి న్యాయం చేయాలని ఆమె కోరారు. రెవెన్యూ డివిజన్ కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు రాములుయాదవ్, వెంకటేశ్, రమేశ్‌నాయక్, ఆనంద్, గణేశ్ నాయక్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధిలోని ఎంవీఎస్ఆర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత, మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవి వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్లాటినం సిటీ 1, 2, వెంకటాద్రి నివాస్, ఏఎంఆర్ ఎన్‌క్లేవ్, సెవెన్ హిల్స్ కాలనీ, సిద్దార్థ కాలనీ, విజయలక్ష్మి కాలనీ 1, 2, అశోక్‌రెడ్డి కాలనీ, ప్రెస్ కాలనీ 1, 2, శ్రీరామ ఎన్‌క్లేవ్, మాతృ శ్రీ నగర్, వైకుంఠపురం, ఏవీరెడ్డి కాలనీ, సాయిరామ్ నగర్, శ్రీపురం కాలనీ, బృందావన్ కాలనీలో సరఫరా నిలిపివేయనున్నారు.

నాదర్‌గుల్ ఫీడర్ పరిధిలో..

నాదర్‌గుల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయింత్రం 5గంటల వరకు రాఘవేంద్ర హోమ్స్, ట్రెజరర్ ఎన్‌క్లేవ్ 1, 2, అంబేద్కర్ నగర్, వైష్ణవీ ఎన్‌క్లేవ్, కృష్ణ సాయి హోమ్స్, శ్రీరామ ఎన్‌క్లేవ్‌లో విద్యుత్ సరఫరాను సరఫరా నిలిపివేయనున్నారు.

ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో..

ఇబ్రహీంపట్నం: కరెంట్ తీగల మరమ్మతుల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం సబ్ స్టేషన్‌లోని ఎంబీఆర్ నగర్, గురునానక్ ఫీడర్ల పరిధిలోని పలు కాలనీలకు, ఖానాపూర్ గ్రామానికి గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంబీఆర్ నగర్ ఫీడర్ పరిధిలోని కేవీ తండా, బృందావన్ కాలనీ, వడ్డెర బస్తీ, ఎంబీఆర్ నగర్, తిరుమల హిల్స్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, రాజమహేంద్ర కాలేజ్, డీబీఎస్ ప్రాంతాలకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా గురునానక్ ఫీడర్ పరిధిలో గల ఖానాపూర్, గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల, చుట్టుపక్కల ఉన్న గృహాలకు, వ్యవసాయ బోరు మోటార్లకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ పంపిణీ ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ స్టేషన్ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సంఘీనగర్, అనాజ్‌పూర్ ఫీడర్లలో విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విద్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కనక దుర్గానగర్, లష్కర్‌గూడ, సుర్మాయిగూడ, గండిచెరువు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలో 11 కెవీ విద్యుత్ లైన్‌లో చెట్లు తొలగిస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సీతారాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిపల్లి 11 కెవీ విద్యుత్‌లైన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే ఆమనగల్లు రూరల్ 11 కెవీ విద్యుత్‌లైన్‌లో మేడిగడ్డ, సంకటోనిపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు.

మంగళ్‌పల్లి పరిధిలో..

ఇబ్రహీంపట్నం: మంగల్‌పల్లి-2 ఫీడర్ పరిధిలోని మంగల్‌పల్లి, సాహెబ్‌గూడ గ్రామాల పరిధిలో గురువారం ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరాఫరాను నలిపివేస్తున్నట్లు ఆదిభట్ల ఏఈ జయన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

ఈపాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

- వ్యవసాయ అధికారులు శ్రీలత, రాజు



కడ్తాల్: రికార్డులను పరిశీలిస్తున్న శ్రీలత

కడ్తాల్: దుకాణదారులు ఈపాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల, విత్తన దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈపాస్ మెషీన్‌లో నమోదు వివరాలు, ఆయా దుకాణాల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. శ్రీలత మాట్లాడుతూ.. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈపాస్ ద్వారా పంటల సాగు వానాకాలానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

రసీదు తప్పక ఇవ్వాలి..

తలకొండపల్లి: ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించడంతో పాటు రైతులకు రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం, వెల్జాల్‌లోని శ్రీ ఆగ్రో రైతు కేంద్రం, న్యూ స్వామి ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, న్యూ ఓంసాయి సీడ్స్ ఫర్టిలైజర్స్ తదితర దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ధరల పట్టిక, బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, ఈ-పాస్ మెషీన్ పనితీరు, అమ్మకాల వివరాలు, ధరల వివరాలను పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత కలిగిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. డీఏపీ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ స్పింది తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మాణం

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య.. కలెక్టర్ శశాంకకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సర్వే నంబర్ 283(ప్రభుత్వ భూమి)లో 2005లో అప్పటి ప్రభుత్వం పీఓటీ కింద స్వాధీనం చేసుకుందని.. ఈ భూమిలో జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ నిర్మించిందన్నారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇళ్ల స్థలాల కోసం పది ఎకరాల్లో ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్మించిందన్నారు. అయితే ఇటీవల కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, స్థానిక నాయకులు కుమ్మక్కై ప్రభుత్వ భూమిలోని దాదాపు 25 ఎకరాలను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని.. ప్రహరీ నిర్మాణం కూడా చేపడుతున్నారన్నారు. ఈ క్రమంలో పల్లె ప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రకృతివనంలోని మొక్కలను కూడా ధ్వంసం చేశారని ఆరోపించారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు.. తమకేమీ పట్టనంటు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని యాదయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు.. శివకుమార్, భిక్షపతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

ఎమ్మెల్యే సబితారెడ్డి



మంత్రాల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, అధికారులు

మీర్‌పేట: చెరువు సుందరీకరణలో భాగంగా పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మీర్‌పేటలోని మంత్రాల చెరువును ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి రెండువైపులా చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువు వద్ద ఆకట్టుకునేలా జింకల విగ్రహాలు, నంది విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, సునీత బాల్‌రాజ్ పాల్గొన్నారు.